క్లుప్తంగా

న్యాయవాదులకు ఉచిత కంటి వైద్య శిబిరం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమని మంచి దృష్టి కలిగి ఉండేందుకు ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. న్యాయమూర్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. నరసరావుపేట మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు రామలింగారెడ్డి, సిబ్బంది న్యాయవాదులకు, గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

54 మంది ఉద్యోగాలకు ఎంపిక



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 54 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. జాబ్ మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని, ఇంటర్వ్యూలకు మొత్తం 71 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినట్లు ఆయన తెలిపారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి డీఈఓటీ రమాదేవి, కళాశాల ప్రిన్సిపల్ యు.కోటేశ్వరమ్మ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణారెడ్డి, వీరాంజనేయులు, సురేష్, కిరణ్, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, సీడాప్ ఉద్యోగ కల్పన అధికారి నాగూల్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర గ్రామం కోసం శిక్షణ



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): గ్రామ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై గురువారం మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి పరిశీలకుడు, బాపట్ల శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డి.వెంకటరావు పాల్గొన్నారు. ప్రజల అవసరాలు తీర్చడంతో పాటుగా భవిష్యత్తు తరాలు వనరులను సద్వినియోగం చేసుకునేలా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యవంతమైన గ్రామాన్ని తయారు చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. రెండు రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ ఎ.శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ప్రదీప్‌కుమార్, వీఏఎస్ వి.శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఏపీఎం సమాధానం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాత గుత్తికొండ పద్మకు నివాళి



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం, వసతుల కల్పన, పలు ప్రభుత్వ సంస్థలకు భూ దానం, భవనాల నిర్మాణం చేపట్టి మహోన్నత వ్యక్తిగా గుత్తికొండ పద్మ నిలిచారని ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆమె వర్ధంతిని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పద్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జి.పున్నారావు, మాజీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్ట్

క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన ఇద్దరు బెల్ట్ షాపుల నిర్వాహకులను ఎస్ఐ కె.నాగేంద్రరావు గురువారం అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన పులిబండ్ల శివయ్య, మాదిరెడ్డి రామాంజనేయులు క్రోసూరు నుంచి మద్యం సీసాలు తెచ్చి అధిక ధరలకు విక్రయిండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ తెలిపారు. వారి నుంచి 33 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే కీర్తి వైన్స్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటారని, వారికి మద్యం సరఫరా చేస్తున్న లైసెన్సు దుకాణాలపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఖరీఫ్ ఆశలు!

- కంది పంటలో తెగుళ్లతో రైతుల దిగాలు
- నివారణకు అన్నదాతల అవస్థలు
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- నిరాశపరుస్తున్న పంట దిగుబడి
- నియోజకవర్గంలో 1,428 హెక్టార్లలో సాగు



బెల్లంకొండ మండలంలో పూత, పిందె దశలో ఉన్న కంది పంట

బెల్లంకొండ: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలను ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు కుంగదీస్తున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ కంది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావించారు. వారు ఆశించిన స్థాయిలో కంది పంట కళకళలాడుతూ కనిపిస్తోంది. కానీ, తెగుళ్ల బెడద రైతులను వేధిస్తోంది. కందిలో శనగ పచ్చ పురుగు, బద్దె పురుగు, మారుక మచ్చల పురుగుతో పాటు పూత దశలో గూళ్లు పురుగులు ఏర్పడడం వల్ల ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు.

భారంగా పెట్టుబడి...

కంది పంటను సాగు చేసిన రైతులకు తెగుళ్ల కారణంగా పెరిగిన పెట్టుబడి భారంగా మారింది. పూత దశలో ఉన్న పంటకు ఇప్పుడే మూడు నుంచి నాలుగు దఫాలు క్రిమిసంహారక మందులు పిచికారి చేసినట్లు అన్నదాతలు చెప్తున్నారు. మందులు పిచికారి చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు వాపోతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి పెదకూరపాడు మండలాల్లో కంది పంటను ఈ ఏడాది ఎక్కువగా సాగు చేశారు. తెగుళ్ల నివారణ కోసం క్రిమిసంహారక మందుల దుకాణాల వద్దకు రైతులు బారులు తీస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా కందిసాగు...

మండలం	కందిసాగు (హెక్టార్లలో)
బెల్లంకొండ	1,009
అచ్చంపేట	210
క్రోసూరు	67
అమరావతి	69
పెదకూరపాడు	73
మొత్తం	1,428 హెక్టార్లు

రాలిపోతున్న పూత, పిందె...

ఇటీవల తుఫాన్ కారణంగా పూత దశలో ఉన్న కంది పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోజుల తరబడి వాతావరణం అనుకూలించకుండా, మబ్బులు పట్టి ఉండడంతో పూత, పిందె రాలిపోవడం, తెగుళ్ల ఉధృతి పెరగడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటను కాపాడుకోవడానికి అధిక ధరలు గల క్రిమి సంహారక మందులను వినియోగించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కంది పంటకు గతంలో రెండు, మూడు పర్యాయాలు మాత్రమే మందులను పిచికారి చేస్తే దిగుబడి చేతికి వచ్చేదని, ప్రస్తుతం పూత దశకే నాలుగు దఫాలు మందులు పిచికారి చేసినట్లు రైతులు చెప్తున్నారు.



తెగుళ్లు ఆశించిన కందిపంట

తెగుళ్లను నివారించలేకపోతున్నాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట చూడడానికి బాగున్నప్పటికీ, పూత దశలో తెగుళ్ల బెడద అధికంగా ఉంది. ఇప్పటికే మూడు, నాలుగు సార్లు మందులు పిచికారి చేసినా ఫలితం కనబడడం లేదు. వ్యవసాయ అధికారులు చెప్పిన మందులను వాడినప్పటికీ తెగుళ్లు అదుపులోకి రావడం లేదు. దీంతో పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు తప్పడం లేదు.

– దారం రమణారెడ్డి, రైతు, మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



కంది పంటకు మారుక మచ్చల పురుగు వ్యాపించి పూత, పిందె దశలో రాలిపోతోంది. అలాగే ఆకులు పూత గూళ్లు గమనిస్తున్నాం. తెగుళ్ల నివారణకు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని రకాల మందులను సూచిస్తూ.. రోజుల వ్యవధుల్లో మందులను మార్పు చేస్తూ పిచికారి చేయాలని చెప్తున్నాం.

– డి.కృష్ణయ్య, ఏవో, బెల్లంకొండ

మిరప సాగుపై అవగాహన



రాజుపాలెం: గణపవరంలో రైతులకు మిరప పంట సాగుపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. లాం శాస్త్రవేత్త పి.గందర్ మాట్లాడుతూ మిరప పంటలోని చీడపీడల గురించి రైతులకు వివరించారు. ఆయిల్ ఫాం సాగుద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి డి.నవీన్, వీహెచ్ఏ రమేష్, వెంకయ్య పాల్గొన్నారు.

300 గ్రాముల గంజాయి స్వాధీనం

ముప్పాళ్ళ: మండలంలోని తురకపాలెం వెళ్లే దారిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యు.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. సమాచారం మేరకు .. ముప్పాళ్ల నుంచి తురకపాలెం వెళ్లే దారిలో చెరువు వద్ద ఇరువురు గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం పోలీసులకు అందింది. సిబ్బందితో దాడి చేసి కారంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన బత్తుల నరసింహారావు, ముప్పాళ్ల చెందిన పఠాన్ చాంద్ బాషాలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న డీటీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో వేణుగోపాల్

క్రోసూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14న జరిగే నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల అధికారులకు గురువారం శిక్షణ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసారావు అధ్యక్షతన ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. ప్రతి టీసీకి ఒక పీవో, ఏపీవో ఉంటారని, ప్రతి ప్రాదేశిక వర్గానికి ఒక ఎన్నికల అధికారి ఉంటారని తెలిపారు. మండలంలో ఉన్న ఎనిమిది వాటర్ యూజర్స్(డబ్ల్యూఏ (ప్రాదేశిక వర్గాలు)కు ఒక్కోదానికి 12 టీసీలున్నాయని, ప్రతి టీసీకి పీవో, ఏపీవో, ప్రతి డబ్ల్యూఏకు ఒక ఎన్నికల అధికారి ఉంటారని చెప్పారు. వీరందరూ తొలుత టీసీ సంబంధించిన ఫాంలు ఏ విధంగా పూర్తిచేయాలి, ఒకవేళ రహస్య ఓటింగ్ వేసే వారుంటే అందుకు చేపట్టాల్సిన విధి విధానాలు, డబ్ల్యూఏకి, డీసీలకు పోటీ పడే అభ్యర్థులుంటే అందుకు సంబంధించిన ఫాంలు ఏవిధంగా పూర్తిచేయాలో వివరించారు. ఉదయం టీసీ సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాగునీటి సంఘాలు, డీసీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి ఏవో వేణుగోపాల్, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల.. ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ముప్పాళ్ళ: మండలంలోని 9 సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం తెలిపారు. మండల పరిధిలో డబ్ల్యూఏ నెం85(దమ్మాలపాడు), 86(తొండపి–2), నెం:88(ముప్పాళ్ళ), 89(తొండపి–3), 91(మాదల–1), 92(మాదల–2), 96(మాదల–3), 167(గోళ్ళపాడు)తో పాటుగా నంబరు 12(తొండపి మైనర్ ఇరిగేషన్ ట్యాంక్)కు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్నికల అధికారి, సహాయ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఉదయం 8గంటలకు అసాధారణ సర్వసభ్య సమావేశంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికలు, 3 నుంచి 5గంటల వరకు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, ఎంపీడీవో పీజేవిలియమ్స్, ఏఓ ఎం.అరుణ, ఏపీఓ ఏడుకొండలు, ఎన్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



సేంద్రియ కూరగాయలతో అమలకుమారి, రైతులు

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి పేర్కొన్నారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఏ గ్రేడ్ మోడల్స్ గురించి శిక్షణిచ్చారు. రైతుల ఆదాయాన్ని పెంచి, 365 రోజులు ఆదాయం వచ్చే మోడల్స్‌ను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసుకోవచ్చన్నారు. గ్రామానికి చెందిన ఉమా మహేశ్వరి ఏ–గ్రేడ్ మోడల్‌లో సాగు చేసిన వరి పంట, ఎల్ ఆకారంలో గట్టుపై సాగు చేసిన ఆకు కూరలు, దుంప, తీగజాతి కూరగాయలు, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ నందకుమార్, సైదయ్య, సౌజన్య, మాస్టర్ ట్రైనర్స్ మధు, బాజీ, మెంటర్ రజిని, ఫార్మర్ సైంటిస్ట్ ఉమా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సుస్థిరాభివృద్ధి



ముప్పాళ్లలో శిక్షణకు హాజరైన డీపీఓ భాస్కరరెడ్డి, ఎంపీడీవో విలియమ్స్

అచ్చంపేట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ నిధుల వినియోగంపై స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వనరుల వినియోగం, భవిష్యత్ తరాలకు తగిన విధంగా మెరుగు పరచుకునే లక్ష్యంతో సమష్టి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, పంచాయతీ విస్తరణాధికారులు పి.వెంకట్రావు, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ బాలాత్రిపుర సుందరి, కార్యదర్శి పంతులునాయక్, అంగన్‌వాడి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి పాల్గొని, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. మొదటి విడత శిక్షణకు ఐదు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఎంపీడీవో పీజే విలియమ్స్, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జయలక్ష్మి, అనంతలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని పరివర్తన ఆశ్రమ పాఠశాలలో ఐక్య మాల మహానాడు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని, క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాలమహానాడు సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఫణిదం గ్రామంలో పీపీపీ గార్డెన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు.

వైఎస్సార్ సీపీ నిరసనను విజయవంతం చేయాలి

బెల్లంకొండ: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శుక్రవారం కలెక్టర్ కార్యాలయాల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం నరసరావుపేట కలెక్టరేట్ వద్ద ర్యాలీ అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



బెల్లంకొండ: కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది పూత, మొగ్గ, పిందె దశలో చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రహమతుల్లా, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ దానియేలు



వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



తాడువాయిలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరావు



భోధనం సదస్సులో తహసీల్దారు అష్రఫున్నీసా బేగం

రాజుపాలెం: గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం వల్లప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కోట నెమలిపురిలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల వల్ల సమస్యలు వందశాతం పరిష్కారం అవుతాయని తెలిపారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలకు అధికారులు వెంటనే పరిష్కారం చూపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామ సచివాలయంలో తహసీల్దార్ మీసాల దానియేలు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఒక దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సూపరింటెండెంట్ తులసీరామ్, సర్వేయర్ పున్నమిరాజు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ, స్థానిక నేత బాలిరెడ్డి, ఇన్నారెడ్డి, వీఆర్వో పెరికల జార్జ్ పాల్గొన్నారు.

అచ్చంపేట: మండలంలోని తాడువాయిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 23 అర్జీలను తహసీల్దారు శ్రీనివాసరావు స్వీకరించారు. అందులో ఆరింటికి పరిష్కారం చూపి, మిగిలిన వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఇంటి నివేశన స్థలాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, రేషన్ కార్డులు కావాలని ప్రజలు కోరారు. పింఛన్లు ఇవ్వాలని గ్రామస్తులు అర్జీలు పెట్టుకున్నారు. మాజీ సర్పంచ్ బాలూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ రెండు సదస్సుల్లో ఎనిమిది అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసారావు తెలిపారు. వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగించుకోవాలి

బెల్లంకొండ: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం తెలిపారు. గురువారం మండలంలోని భోధనం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం దక్కని సమస్యలను వెంటనే పరిష్కారం అందుతుందన్నారు. గ్రామంలో పునరావాస భాధితులకు పరిహారం సమస్యలపై పలు అర్జీలను అధికారులకు అందజేశారు. పలు రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, దేవదాయ శాఖ అధికారి రామకోటి రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముప్పాళ్ల సదస్సుకు ఎమ్మెల్యే రాక

ముప్పాళ్ళ: మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామమస్తులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయం వద్ద జరిగే సదస్సుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారని తెలిపారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ

ముప్పాళ్ళ: అన్నదాతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న చేపట్టిన రైతుల కోసం.. రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ ఉద్యమబాటను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు గురువారం కోరారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



డ్రమ్ముల్లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న రవీంద్ర రత్నాకర్

రాజుపాలెం: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దీనిపై గ్రామీణ ప్రజలకు కర పత్రాలు అందజేసి అవగాహన కల్పించాలని సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సూచించారు. కొండమోడు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. సైడు కాల్వలు పరిశీలించి, పూడికతీతలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇళ్లల్లో పాత టైర్లు, కొబ్బరి బోండాలను తొలగించాలని, కూలర్లలో నీటిని నిల్వ ఉంచరాదని గ్రామస్తులకు చెప్పారు. ఆయన వెంట సత్తెనపల్లి సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎం శారద, ఆశాకార్యకర్త సుజాత, మున్నీరు పాల్గొన్నారు.